# ఇండియన్ పాలిటీ

## ప్రాథమిక హక్కులు - సుప్రీంకోర్టు తీర్పులు

★ **మినర్వామిల్స్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1980) కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంట్‌కు ఉందని, అయితే ఆ అధికారాన్ని రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని నాశనం చేయడానికి వినియోగించకూడదని, అంతేకాకుండా రాజ్యాంగ సవరణాధికారం అపరిమితమైంది కాదని చెప్పింది. ప్రాథమిక హక్కులు రాజ్యాంగ మౌలిక స్వరూపంలో అంతర్భాగం. కాబట్టి, వాటిని తగ్గించడం, రద్దుచేయడం రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించింది.**

## IV. మత స్వాతంత్ర్యపు హక్కు (నిబంధనలు 25-28)

★ బిజయ్ ఎమాన్యుల్ Vs స్టేట్ ఆఫ్ కేరళ (1986) కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ జాతీయ గీతం పాడటం వారి మత విశ్వాసానికి విరుద్ధమని భావించి మౌనంగా ఉండటం తప్పు కాదని తెలియజేసింది. జాతీయ గీతం పాడటం ప్రాథమిక విధి, అయితే మౌనంగా ఉండే హక్కు (19(1)), మత స్వాతంత్ర్యపు హక్కు (25 (1)) ప్రాథమిక హక్కులు కాబట్టి వాటిని అనుభవించడం రాజ్యాంగ వ్యతిరేకం కాదని స్పష్టం చేసింది.

★ సెయింట్ జేవియర్ కాలేజ్ Vs గుజరాత్ (1974) కేసులో సుప్రీంకోర్టు లౌకిక అనే పదానికి ఇలా వివరణ ఇచ్చింది - 1) దేవుడిపై ద్వేషం లేదా స్నేహాన్ని చూపని స్వభావం. 2) దేవుడిని ఇష్టపడే లేదా ఇష్టపడని వ్యక్తిని ఒకే విధంగా చూడటం. 3) ప్రభుత్వ వ్యవహారాల నుంచి దేవుడికి సంబంధించిన విషయాలను మినహాయించడం.

★ రెవరెండ్ స్టానిస్‌లాస్ Vs మధ్యప్రదేశ్ (1977) కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ బలవంతపు మతమార్పిడిని నిషేధిస్తూ మధ్యప్రదేశ్, ఒడిశా ప్రభుత్వాలు రూపొందించిన చట్టాలు రాజ్యాంగ విరుద్ధం కాదని తెలియజేసింది.

★ ఎస్.ఆర్.బొమ్మై Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1994) కేసులో సుప్రీంకోర్టు లౌకికతత్వం భారత రాజ్యాంగ మౌలిక లక్షణాల్లో ఒకటిగా తెలియజేసింది.

## V. సాంస్కృతిక, విద్యావిషయపు హక్కులు (నిబంధనలు 29-30)

★ డీఏవీ కాలేజ్ (దయానంద ఆంగ్లో వేదిక్ కళాశాల) Vs పంజాబ్ (1971) కేసులో నిబంధనలు 29 (1), 30 (1), 19, 14 విచారణలోకి వచ్చాయి. ఇందులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ గురునానక్ యూనివర్సిటీ తమ అనుబంధ కళాశాల అయిన దయానంద ఆంగ్లో వేదిక్ కళాశాలలో పంజాబీ భాష మాత్రమే బోధనా భాషగా ఉండాలని ఆదేశించడం మైనార్టీలకు కల్పించిన సాంస్కృతిక విద్యావిషయక హక్కును ఉల్లంఘించడమేనని, కాబట్టి యూనివర్సిటీ ఆదేశం చెల్లదని తీర్పునిచ్చింది.

★ ఆల్ సెయింట్స్ Vs స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (1980) కేసులో సుప్రీంకోర్టు మైనారిటీ విద్యాసంస్థల నిర్వహణలో ప్రభుత్వం జోక్యం చేసుకోరాదని స్పష్టం చేసింది.

★ టి.యం.ఎ.పాయ్ ఫౌండేషన్ Vs స్టేట్ ఆఫ్ కర్ణాటక (2002) కేసులో సుప్రీంకోర్టు మైనారిటీల సాంస్కృతిక, విద్యావిషయక హక్కులకు సంబంధించి (అనేక అంశాలను పరిష్కరించి), మైనారిటీ విద్యాసంస్థల విషయంలో ప్రభుత్వం ఏ సందర్భంలో జోక్యం చేసుకోవచ్చో, ఏ సందర్భాల్లో జోక్యం చేసుకోకూడదో స్పష్టంగా వివరించింది. మైనారిటీ అనే పదానికి సంబంధించి దీన్ని చరిత్రాత్మకమైన తీర్పుగా న్యాయవేత్తలు పరిగణిస్తారు.

## ఇతర తీర్పులు

ఆస్తిహక్కు, రాజ్యాంగ సవరణలకు సంబంధించిన కేసులు.

★ శంకరీప్రసాద్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1951) కేసులో సుప్రీంకోర్టు మొదటి రాజ్యాంగ సవరణ చట్టబద్ధమేనని చెప్పింది. ఈ కేసులో మొదటిసారి సుప్రీంకోర్టు న్యాయసమీక్షాధికారాన్ని ఉపయోగించింది.

★ సజ్జన్‌సింగ్ Vs స్టేట్ ఆఫ్ రాజస్థాన్ (1964) కేసులో సుప్రీంకోర్టు ఆస్తిహక్కుకు సంబంధించి పార్లమెంట్ చేసిన 17వ రాజ్యాంగ సవరణ చట్టం రాజ్యాంగబద్ధమేనని ప్రకటించింది.

★ గోలక్‌నాథ్‌కేసు Vs స్టేట్ ఆఫ్ పంజాబ్ (1967) కేసులో సుప్రీంకోర్టు తీర్పు సంచలనం సృష్టించింది. ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంట్‌కు లేదని, ప్రాథమిక హక్కులను సవరించాలంటే ప్రత్యేక రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటు చేయాలని ప్రకటించింది. ఈ తీర్పు అప్పటివరకు ఇచ్చిన తీర్పులకు భిన్నంగా ఉంది.

★ కేశవానంద భారతి Vs స్టేట్ ఆఫ్ కేరళ (1973) కేసులో సుప్రీంకోర్టు చరిత్రాత్మకమైన, భారత ప్రజాస్వామ్యాన్ని నిరంతరం కాపాడే తీర్పును ఇచ్చింది. ఈ కేసులో 24, 25 రాజ్యాంగ సవరణల చట్టబద్ధతను ప్రశ్నించారు.

★ పార్లమెంట్‌కు ప్రాథమిక హక్కులను సవరించే అధికారం ఉందని, అయితే రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే విధంగా రాజ్యాంగ సవరణ ఉండకూడదని తెలియజేసింది. రాజ్యాంగ మౌలిక స్వరూపం అనే భావనను మొదటిసారిగా వెల్లడించింది. కానీ నిర్వచించలేదు.

## మాదిరి ప్రశ్నలు

**1.** రక్షణ దళాలు, రాయబారులకు, సాధారణ ప్రజానీకానికి మధ్య వివక్ష చూపించడం 14వ నిబంధనను ఉల్లంఘించినట్లు కాదని సుప్రీంకోర్టు కింది ఏ కేసులో స్పష్టం చేసింది?

ఎ) బల్సారా Vs స్టేట్ ఆఫ్ బాంబే (1951)

బి) చిరంజిత్‌లాల్ చౌదరి Vs కేంద్ర ప్రభుత్వం (1950)

సి) సాఫీర్ అహ్మద్ Vs ఉత్తర్‌ప్రదేశ్ (1955)

డి) సుభాచంద్ Vs ఢిల్లీ ఎలక్ట్రికల్ సప్లై (1981)

**2.** రిజర్వేషన్లు 50%కి మించరాదని సుప్రీంకోర్టు కింది ఏ కేసులో పేర్కొంది?

ఎ) చంపకం దొరై రాజన్ Vs మద్రాసు ప్రభుత్వం (1951)

బి) యం.ఆర్.బాలాజీ Vs మైసూరు రాష్ట్ర ప్రభుత్వం (1963)

సి) అసోసియేటెడ్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా Vs కేంద్ర ప్రభుత్వం (1988)

డి) ఇనాందార్ Vs మహారాష్ట్ర ప్రభుత్వం (2005)

**3.** కిందివాటిలో ఏ కేసుకు ముల్కీ నిబంధనల చట్టంతో సంబంధం ఉంది?

ఎ) ఇందిరా సహానీ Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (1992)

బి) నీరజాచౌదరి Vs స్టేట్ ఆఫ్ మధ్యప్రదేశ్ (1984)

సి) ఉన్నికృష్ణన్ Vs స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (1993)

డి) ఎ.వి.ఎస్.నరసింహారావు Vs ఆంధ్రప్రదేశ్ (1970)

**4.** జాతీయ గీతం కేసుగా ప్రచారం పొందిన కేసు?

ఎ) అజయ్‌కామా Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1988)

బి) బిజయ్ ఎమాన్యూల్ Vs స్టేట్ ఆఫ్ కేరళ (1986)

సి) మేనకాగాంధీ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1978)

డి) బ్రిజ్ భూషణ్ Vs స్టేట్ ఆఫ్ ఢిల్లీ (1950)

**5.** ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం, 2000లోని సెక్షన్ 66A భావవ్యక్తీకరణకు విరుద్ధమని, చెల్లదని స్పష్టం చేసిన కేసు ఏది?

ఎ) సోదన్‌సింగ్ Vs న్యూఢిల్లీ మున్సిపల్ కమిటీ (1989)

బి) రంగరాజన్ Vs స్టేట్ ఆఫ్ తమిళనాడు

సి) శ్రేయాసింఘాల్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (2015)

డి) సి.పి.ఐ.(యం) Vs భరత్‌కుమార్ (1997)

**6.** విద్యార్జన ప్రాథమిక హక్కుల్లో అంతర్భాగమని సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పునిచ్చింది?

ఎ) A.K. గోపాలన్ Vs స్టేట్ ఆఫ్ మద్రాసు (1950)

బి) ఉన్నికృష్ణన్ Vs ఆంధ్రప్రదేశ్ (1993)

సి) నీరజాచౌదరి Vs మధ్యప్రదేశ్ (1984)

డి) ఎ, సి సరైనవి

**7.** కింది ఏ కేసులో బాలకార్మికుల పునరావాస నిధిని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు పేర్కొంది?

ఎ) బందువా ముక్తిమోర్చా Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1997)

బి) సలాల్ హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్టు కార్మికులు Vs జమ్మూకశ్మీర్ (1983)

సి) పీయూసీఎల్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (2001)

డి) ఏదీకాదు

**8.** లౌకిక అనే పదానికి స్పష్టమైన వివరణ ఇచ్చిన కేసు?

ఎ) బిజయ్ ఎమాన్యుల్ Vs కేరళ (1986)

బి) స్టానిస్‌లాస్ Vs మధ్యప్రదేశ్ (1977)

సి) సెయింట్ జేవియర్ కాలేజ్ Vs గుజరాత్ (1974)

డి) పీయూసీఎల్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (2001)

**9.** కేశవానందభారతి Vs కేరళ ప్రభుత్వం (1973) కేసుకు కింది ఏ భావనతో సంబంధం ఉంది?

ఎ) లౌకికతత్వం

బి) రాజ్యాంగ మౌలిక స్వరూపం

సి) మైనారిటీలు

డి) విద్య ఒక ప్రాథమిక హక్కు

**10.** రాజ్యాంగ సవరణకు పార్లమెంటుకు అధికారం లేదని, ప్రత్యేక రాజ్యాంగ పరిషత్తును ఏర్పాటు చేయాలని కింది ఏ కేసులో సుప్రీంకోర్టు తెలిపింది?

ఎ) మినర్వా మిల్స్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1980)

బి) కేశవానందభారతి Vs కేరళ ప్రభుత్వం (1973)

సి) సజ్జన్‌సింగ్ Vs రాజస్థాన్ (1964)

డి) గోలక్‌నాథ్ Vs పంజాబ్ 1967

**జవాబులు**

1-ఎ; 3-డి; 2-బి; 4-బి; 5-సి; 7-ఎ; 6-బి; 8-సి; 9-బి; 10-డి.

**రచయిత: డాక్టర్ ఎం. భాస్కర రాజు**